## 'ఈనాడు ఆదివారం'కి కథ

# పేరాసైట్

ఏడుకొండలరావుగారు మా అపార్టుమెంటులో మా పక్క ఫ్లాటుకి రాగానే మాకెంతో ఆనందం కలిగింది. ఎందుకంటే చాలా కాలంనుండి ఆ ఫ్లాటు ఖాళీగా వుంది. ఇప్పటికైనా ఓ కుటుంబం వచ్చి చేరినందుకు మాక్కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. ఆయన రిటైర్ అయ్యి నాలుగేళ్ళు కావస్తోందిట..అందరిలో ఇట్టే కలసి పోతాడు.వాళ్ళావిడ సాక్షాత్తు లక్ష్మీదేవిలా వుంటుంది..అలా అని ఒళ్లంతా నగలు దిగేసుకుని వుండదు..సాదాసీదాగా జరీచీర కట్టుకుని..పెద్దబొట్టు పెట్టుకుని చూడగానే గౌరవభావం కలిగేలా వుంటుంది. ఉన్న ఒక్కగానొక్క కొడుకు పెళ్ళవంగానే వేరు వెళ్ళిపోయాట్ట.. ఆ ఇంట్లో వాళ్ళిద్దరూ అంతే!

"మీరు పెద్దవాళ్ళు.. మా అమ్మా నాన్న లాంటి వాళ్ళు..మా ఇంటికి వస్తూ పోతుండవచ్చు..ఏం కావాలన్న నిర్మొహమాటంగా అడగవచ్చు..నిజానికి మా ఇళ్ళు మీ ఇళ్ళు అనుకోండి."అన్నాము నేను మా ఆవిడా ఆపేక్షగా..

"అలాగే..మీకేమీ కాని మమ్మల్ని అన్నీ మీరే అంటుంటే..మాకేం మాట్లాడాలో తెలియడం లేదు. మా కోడుకు కోడలూ గుర్తొచ్చారు"అని కళ్ళొత్తుకున్నారు. మాకు హృదయం ద్రవించిపోయింది.

***

తెల్లవారింది.

"ఏం చేస్తున్నారు?"అంటూ వచ్చారు ఏడుకొండలరావుగారు.

"రండి..రండి"అని సాదరంగా అహ్వానించాను.

లక్ష్మి నవ్వుతూ కాఫీ టిఫిన్ నాతోపాటూ ఆయనకీ పెట్టి..మరో ప్లేటుతో వాళ్ళింటికి వెళ్ళింది ఆవిడకి పెట్టడానికి.

"ఏంటీ ఈనాడు పేపరా" అన్నాడు జేబులోంచి కళ్ళజోడు తీస్తూ..

"అవునండీ" అన్నాను పేపర్ ఆయన చేతికిస్తూ.."పొద్దున్నే పేపర్ చదవడమంటే నాకు చాలా ఇష్టం.చదవకపోతే అదోలా వుంటుంది"అన్నారు..'పెద్దాయన కొత్తగా వచ్చారు కదా పాపం నిదానంగా పేపరువేయించుకుంటారు' అని పేపరు ఆయన చేతికిచ్చాను. నిజానికి పొద్దున్నే పేపరు చదవ కుండా నేనూ ఉండలేను.

"నేను పేపర్ మొత్తం..అక్షరం వదిలిపెట్టకుండా చివరి పేజీ దాకా చదువుతా.."అన్నారు పేపర్ చదవడానికి ఉపక్రమిస్తూ.

ఇహ చేసేదేంలేక స్నానంచేయడానికి లేచాను.

నేను ఆఫీసుకి బయలుదేరేటప్పుడు కూడా ఆయన తదేకధ్యానంతో అలా పేపరు చదువుతూనే వున్నాడు.

***

సాయంత్రం ఇంటికొచ్చాక తెలిసిందేమిటంటే..వాళ్ళింట్లో గ్యాస్ లేదట..ఈ కొత్త అడ్రస్ కి మార్పించుకుని..గ్యాస్ తెప్పించుకోవాలిట. అందుకని మా ఇంట్లోనే భోజనాలు చేశారట. రాత్రి మాతోటే భోజనాలు చేస్తూ"మిమ్మల్ని ఇలా ఇబ్బంది పెట్టడం మాకు చాలా బాధ కలిగిస్తోంది. ఈ సిటీలో తాగడానికి గుక్కెడు నీళ్ళు కూడా ఇవ్వరు అలాంటిది..మాకింత అన్నంపెట్టి..బ్రతికిస్తున్నారు".అన్నారు.

"అయ్యో అలా అనుకోకండి..మీరు పరాయివాళ్ళలా మేము భావించడంలేదు.మా అమ్మా నాన్న అని చెప్పాం కదా..ఇది మీ ఇళ్ళే అనుకోండి"అన్నాం.

"అన్నదాతా సుఖీభవ!" అని లేచి టీవీ ముందు కూర్చున్నారు.

వాళ్ళకిష్టమైన సీరియల్ పెట్టించుకున్నారు. నేను లక్ష్మీ బయట కబుర్లు చెప్పుకుంటూ..కూర్చున్నాం.

"లక్ష్మీ..నీకు ఇష్టమైన సీరియల్ వచ్చే టైము కదా ఇది అన్నాను"

"పోన్లేండి..పాపం పెద్దవాళ్ళు..వాళ్ళు తిరుగుతుంటే అత్తగారు మామగారు తిరుగుతున్నట్టే వుంది.."అంది.
రాత్రి పదకొండు గంటలకి వాళ్ళు సెలవు తీసుకున్నారు.

***

ఉదయాన్నే ఆయన ప్రత్యక్షమవడం.
కాఫీ టిఫిను..పేపరు చదవడం..భోజనాలు..టీ వీ చూడడం షరామామూలే..
పదిహేనురోజులైనా..వాళ్ళు గ్యాస్ కోసం ప్రయత్నించడం గాని..ఇంటికి కావలసినవి తెచ్చుకోవడంగానీ చెయ్యడంలేదు.
పైగా అవసరమైనప్పుడల్లా ఆయనేమో నా స్కూటర్ వాడుకోవడం..నేనేమో బస్సులో వెళ్ళడం..అప్పుడప్పుడు 'ఒంట్లో బాగుండడం లేదు..డాక్టర్ దగ్గరికి వెళ్ళాలని' డబ్బులు తీసుకోవడం.
వాళ్ళ మనస్తత్వం నాకేమీ అర్థంకావడం లేదు.
ఒకరోజు ఏడుకొండలరావుగారు ఉన్నట్టుండి పడిపోయారు.
వాళ్ళావిడ ఏడ్చుకుంటూ పరిగెత్తుకుని మా ఇంటికి వచ్చింది.
మేము వెంటనే ఆంబులేన్స్ పిలిపించి మంచి హాస్పిటల్లో చేర్పించాము.
నాలుగు రోజులైన తర్వాత డిస్చార్జ్ చేశారు.నేనూ మా ఆవిడా చాలా కష్టపడ్డాం.వాళ్ళబ్బాయిని పిలిపిస్తాను ఫోన్ నెంబరు కాని అడ్రసు కాని ఇమ్మంటే ససేమిరా అన్నారు..అంతేకాదు"కన్న బిడ్డకన్నా ఎక్కువగా ఆదుకున్నారు..మాకు కొరగాని కొడుకు పుట్టాడు.వాడి మొహం చూడ దల్చుకోలేదు..మీకు కష్టమైతే చెప్పండి..మా బాధలేవో మేము పడతాం" అని కంట నీరు పెట్టుకున్నారు.
ఇంటికొచ్చాక పాపం లక్ష్మికి మరింత కష్టమెక్కువైంది. అన్నీ దగ్గరుండి చూసుకుంటోంది. అలా..అలా నెలదాటింది. ఆయనకి సంపూర్ణ ఆరోగ్యం చేకూరింది.
వాళ్ళ ఇంటికి వెళ్ళడం అనేది కనిపించడం లేదు. వాళ్ళింటికి కూడా నేనే అద్దె కట్టాను.
ఇదేం సంబంధమో అర్థం కావడం లేదు. ఓ సినిమాకెళ్ళడం..షికారుకెళ్ళడం మేము ఎప్పుడో మానేశాము. రాను రాను వాళ్ళ ప్రభావం మామీద ఎక్కువగా పడసాగింది.ఇంట్లో మా స్వేచ్ఛ తక్కువై వాళ్ళ ఇష్టాలు అభిరుచులు పెత్తనం చేయసాగాయి.నాకు పిచ్చెక్కినట్టుగా వుంటోంది. మా ఆవిడకి ఇప్పుడిప్పుడే వాస్తవం అవగాహనకి వస్తోంది.అవసరానికి సహాయం చెయ్యమనడం వేరు.పూర్తిగా ఆధార పడడం వేరు. ఇలాంటి వాళ్ళని చూడడం ఇదేమొదలు.
మా ఫ్రెండ్స్ కి చెబితే 'మంచి తనానికి కూడా ఓ హద్దు వుండాలి..వాళ్ళు మిమ్మల్ని వెర్రి వాజమ్మల్ని చేశారు. కన్న వాళ్ళనే చూడక ఓల్డ్ ఏజ్ హోమ్స్ లో వుంచుతున్న కరవు రోజులివి అలాంటిది బాదరాయన పీచు సంబందాలు కలుపుకోవడమేంట్రా? పిచ్చెక్కిందా?' అని తిట్టిపోశారు.
ఇహ లాభం లేదని నేను ఒకనాడు.."ఏదో మాటవరసకి మా అమ్మా నాన్నా అన్నాం..ముసలివాళ్ళుకదా అని సహాయం చేయడానికి సిద్ధపడ్డాం..అంతమాత్రంచేత మా ఇంట్లోనే తిష్టవేయాలా.."కొంచెం తీవ్రంగానే అన్నాను.
మొదట్లో కాస్త కళ్ళనీళ్ళతో "బాబూ..నువ్వు..దేవుడివి..మనుషుల్లో మహానుభావుడివి.."అంటూ ఏదో అనబోయారు..కానీ నేను అడ్డుకుని "చాలు..మా సుఖం..శాంతి అన్నీ హరించుకు పోయాయి.నిజానికి మా అమ్మా నాన్నలు కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. .దయచేసి మీ ఇంటికి మీరు వెళ్ళిపోండి..అవసరానికి పిలవండి ఆదుకుంటాం..ప్లీజ్"అన్నాను కోపంగా.
అంతే ఏడుకొండలరావుగారిలోని నెగటివ్ క్యరెక్టర్ బయటకి వచ్చింది."ముసలివాళ్ళకింత సహాయంచేస్తే చచ్చిపోతారా? మంచిచేస్తే దేవుడు అంతకంత మేలు చేస్తాడని తెలియదా..పొమ్మంటే ఉండడానికి మేమేం చీమూ నెత్తురు లేనివాళ్ళం కాదు. మేమేం ఊరికే లేము..మా అనుభవంతో మీకు అవసరమైనప్పుడల్లా మంచి మంచి సలహాలనిచ్చాం..పదవే రక్తం పంచుకు

పుట్టినవాడే కొడుకు కానప్పుడు బయటి వాళ్ళు మాత్రం మన పిల్లలవుతారా?"అని బిగ్గరగా అరుస్తూ విసురుగా వాళ్ళావిడ చెయ్యి పుచ్చుకుని బయటకి తీసుకుపోయాడు. ఆరోజెందుకో చాలా రిలీఫ్ గా అనిపించింది ఇద్దరికీ.

తర్వాత తెలిసిందేమిటంటే పై ఫ్లోర్లో వున్న ఏకాంబరం గారింట్లో సెటిలయ్యార్ట. అంతేకాదు నలుగురి దృష్టిలో మంచి అనిపించుకోవాలని వాళ్ళని మేము ఇంట్లో వుంచుకుని వాళ్ళచేత రకరకాల పనులు చేయించుకున్నామట..హాస్పిటల్లో అయిన ఖర్చు కూడా ముక్కుపిండి వసూలు చేశామట. ముసలి వాళ్ళని కూడా మాకు కనికరం లేదట.అపార్టుమెంటు మొత్తం ఇదే ప్రచారం. అందరూ మమ్మల్ని వింతగా చూస్తున్నారు'పైకి ఇంత మంచిగా కనిపించే వీళ్ళు ఇంత రాక్షసులా' అని.

మా తప్పేం లేకపోయినా మాకు సిగ్గుగా అనిపిస్తోంది. మంచితనానికి ముగింపు అలా వుంటుందని ఊహించలేదు.

ఇహ అక్కడ వుండడం మావళ్ళ కావడం లేదు. మా ఫ్లాట్ అమ్మకానికి పెట్టాం.

**- ప్రతాప వెంకట సుబ్బారాయుడు**

**"ఈ కథ నా సొంతం..అనుసరణ కాని..అనుకరణ కాని కాదు..ప్రసారం కాలేదు"**


**చిరునామా:**

**ఫ్లాట్ నం:B-40**

**రోడ్ నం:4**

**జె జె నగర్**

**సైనిక్ పురిపోస్ట్**

**సికింద్రాబాద్**

**500 094**
**సెల్: 9393981918**